## చిట్టి కథ



# సమానత్వం

— కామేశ్వరి

పొద్దున్న పదకొండు గంటలవుతోంది. వనితకి ఇంకా పని తెమలలేదు. ఒంటి గంటకు బాబిగాడు వచ్చేస్తాడు. వాడు వచ్చేసరికి పని తెమలకపోతే ఇంకా రోజు పని పూర్తి కానట్టే, అనుకుంటూ స్కూల్ యూనిఫారం ఇస్త్రీ చేస్తోంది వనిత.

కాలింగ్ బెల్ మ్రోగింది. చేస్తున్న పని వదిలి తలుపు దగ్గర కర్టెన్ తెరిచి చూస్తే మనోహర్. ఆఫీసుకెళ్ళిన భర్త మనోహర్ ఈ టైంలో ఎందుకు వచ్చినట్లో అనుకుంటూ తలుపు తీసింది.

మనోహర్ లోపలికి వస్తూనే "ప్రతిమకి ఆటోలో వెళుతూంటే అక్సిడెంట్ అయింది, కాలికి చేతికి ఫ్రాక్చర్ అయిందని హాస్పిటల్ నించి మా బావ ఫోన్ చేశాడు. పద నువ్వు కూడా వస్తావని ముందు ఇంటికి వచ్చేను" అన్నాడు.

"అయ్యో నడవడానికి కష్టమే కాలంటే. పోనీ లెండి పెద్ద ప్రమాదం తప్పింది."

"ఆరు వారాలైనా పడుతుంది ప్లాస్టర్ తియ్య డానికి. తొందరగా పద వెళదాం."

"ఉన్న పళాన అంటే ఎలా? ఇంకో గంటలో బాబీ వస్తాడు. మూడున్నరకి మంజు వస్తుంది. పక్కింటి వాళ్ళు ఊరికి వెళ్ళారు తాళాలు ఇచ్చి బాబీని చూడమని చెబుదామంటే. నా మాట విని మీరు వెళ్ళి ముందు చూసిరండి. ఈలోగా పనిపిల్ల ఎక్కడైనా చుట్టుపక్కల ఉందేమో చూస్తాను."

"ఆ పనులన్నీ చూసుకొంటూ కూర్చొందికి ఇది సరదాగా వెళ్ళి కబుర్లు చెప్పే పరిస్థితి కాదు. వెళ్ళాల్సింది హాస్పిటల్‌కి. మా బావ ఏమనుకుం టాడు. ప్రతిమ ఏమనుకుంటుంది."

"నాకు మాత్రం తెలీదా? కానీ పిల్లల్ని ఏం చేద్దాం. మంజూకైనా కొంత ఏ పనిమీద వెళ్ళిందో అమ్మ అన్న జ్ఞానం ఉంటుందేమో కాని బాబీగాడు కనిపించకపోతే గోల పెట్టేస్తాడు. పోనీ మీరు ఇంట్లో ఉండండి. నేను చూసి వచ్చేక మీరు వెళుదురు గాని."

"నాకు అంతసేపు ఉండడానికి కుదరదు. నేను నిన్ను వెంటనే తీసుకొని హాస్పిటల్ దగ్గర దించి, ప్రతిమని పలకరించి ఆఫీసుకి వెళ్ళిపోవాలి."

"మరైతే బాబీని ఏం చేద్దాం. మంజుని ఏం. చేద్దాం చెప్పండి?"

"పైన ఆడుకొంటూ ఉంటారులే. ఒక్కరోజు రాగానే తినకపోతే కొంపలంటుకుపోవు."

ఊరికే చిరాకుపడిపోతున్నాడు మనోహర్. వనితకి అతనికింకెలా చెప్పాలో అర్థం కాలేదు. గబగబా తయారై వంటింట్లో పళ్ళు కనిపిస్తే అవి ఒక బాగ్‌లో వేసి తాళం వేసి తాళం వేసిన గడియకి బాగ్‌ని వేలాడదీసింది. మనోహర్, వనిత హాస్పిటల్ చేరుకొన్నారు. పలకరింపులు అయ్యేక "ప్రతిమకి తినడానికి ఏం తేలాదా?" అన్నాడు మనోహర్.

"నేనింకా వంట మొదలుపెట్టలేదు. మీరు నన్ను తొందరిచ్చేరా. ఒక్క గంట ఆగితే వంట చేసే దాన్ని. బాబిగాడ్ని తీసుకొని వచ్చేవాళ్ళం."

"అన్నయ్యా ఈ రోజు శెలవు పెట్టకూడదా?" అంది ప్రతిమ.

"నాకు అర్జంటు పనులున్నాయి. నేను వెంటనే వెళ్ళాలి. వనితా నువ్వు ఆటోలో ఇంటికి వెళ్ళి ప్రతిమకి భోజనం తీసుకురా" అన్నాడు.

మనోహర్ కేసి తెల్లబోయి చూసింది వనిత. పైకి ఏమన్నా హాస్పిటల్ బెడ్ మీద ఉన్న ఆడపడుచు కష్టపెట్టుకోవచ్చు. తను శెలవు పెట్టి ఇంట్లో ఉండడం కుదరదు. వండి పెట్టించి హాస్పిటల్‌కి తీసుకొచ్చి చెల్లెలి దగ్గర ఉండడమూ కుదరదు అంటాడు. అన్నీ భార్యే చెయ్యాలనుకొంటూ, ప్రాక్టికల్‌గా ఎం దుకు ఆలోచించడు అనుకొంది వనిత.

మూడు రోజులు హాస్పిటల్లో ఉంచారు ప్రతి మని. ఆ మూడు రోజులూ ఎలా గడిచిపోయాయో, గానీ వనిత పిల్లలని అనాథల్లా వదిలిపెట్టి, హాస్పి టల్‌కి, ఇంటికీ మధ్య తిరిగింది.

హాస్పిటల్ నించి మనింటికే తీసుకెళదామన్నాడు మనోహర్. చిన్న పిల్లలు ఇద్దరు. మంచినీళ్ళు కూడా తీసుకొని తాగని భర్త, చెల్లెలి మీద అపార మైన ప్రేమ. ఆ అమ్మాయిని అన్నగా అవసరానికి ఆదుకోవాలనే అభిమానం. 'తనేం అన్నా చెల్లెళ్ళ అభిమానానికి అడ్డం పడడం లేదు. ఒక బరువు ఎత్తవలసి వచ్చినప్పుడు సాటి మనిషిగా చెయ్యి వెయ్యమంటున్నానంతే' అనుకొంది వనిత.

ప్రతిమ భర్త ప్రతిమని తన ఇంటికే తీసుకు వెళతానన్నాడు. వంట మనిషి కోసం కూడా ప్రయ త్నించాడు. ప్రతిమకి కొత్తవాళ్ళ చేత మంచం మీద ఉండి చేయించడం కష్టం. అందుకే అన్నయ్య కూడా రమ్మంటున్నాడు కదా అక్కడికే వెళతానంది.

మనోహర్ ఓ పెద్ద కంపెనీకి జనరల్ మేనేజర్. అతను చెయ్యాలనుకొంటే ఎప్పుడూ పని వుం టుంది. ప్రతిమకి పెళ్ళయి రెండేళ్ళయింది. ఉద్యోగం చేస్తోంది. ఆఫీసుకి లీవ్ లెటర్ పంపి డిశ్చార్జి అవ గానే మనోహర్ ఇంటికి వచ్చింది.

ప్రతిమ కోసం గెస్ట్ రూం శుభ్రం చేసి, అన్నీ సదుపాయంగా అమర్చింది వనిత. సరదాగా మాట్లా డుతూ, టైంకి ఆహారం, మందు అమరుస్తూ, బాత్‌రూంకి తీసుకువెడుతూ ప్రతిమ పూర్తిగా కోలు కొని ప్రతిమ చేత అమ్మ కన్నా ఎక్కువగా చూసు కొన్నావు అనిపించుకొంది వనిత.

మనోహర్‌కి పొద్దున్న ఎవర్నీ పలకరించడానికి కూడా టైం ఉండదు. సాయంకాలం వచ్చేసరికే ఎనిమిది. అప్పుడు కాసేపు మాట్లాడతాడు. మధ్యలో ప్రతిమ భర్త స్నేహితులు విజిట్ చేసేవారు. మనోహర్‌కి వనితకి పని ఎక్కువవుతుందేమో, ఈ మాత్ర, మంచినీళ్ళు ప్రతిమకి పట్టుకెళ్ళి ఇద్దాం అని అనిపించదు. డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుంది అన్న ఫీలింగ్ వస్తే కూడా మనోహర్‌కి ఇష్టం ఉండదు. తను రిజర్వులోకి అని దాచిన డబ్బు కూడా ఖర్చు పెట్టింది వనిత. వనిత, ప్రతిమల మధ్య ఏ చికాకు లేకుండా ప్రతిమ కాలు, చెయ్యి ప్లాస్టర్ తీసేరు. కొద్దిపాటి ఎక్సర్‌సైజెస్‌తో మామూలు మనిషయింది. వెళ్ళేటప్పుడు చీర, జాకెట్ పెడుతున్న వనితను కౌగిలించుకుని ఆప్యాయంగా మరోసారి కృతజ్ఞత చెప్పుకొంది. 'అన్నయ్య రమ్మని నోటితో అన్నాడే కాని శ్రమంతా నీదే' అంటూ సంతోషంగా వెళ్ళిపోయింది.

ప్రతిమ వెళ్ళిపోయేక వెలితిగా అనిపించింది వనితకి. ఆ సమయంలో తమ్ముడు ఊరి నుంచి వచ్చేడు. సంగతేమిటంటే "తల్లికి హార్టు ప్రాబ్లమ్. బైపాస్ చెయ్యాలంటున్నారు. కొంత డబ్బు ఉంది. కొంత బావగారు ఏమైనా సర్దితే ఆరు నెలల్లో ఇచ్చేస్తాను అప్పటికి రావలసింది ఉంది" అన్నాడు.

వనిత తమ్ముడికి ఏం సమాధానం చెప్పలేదు. మనోహర్ వచ్చాక మాటల్లో చెప్పింది.

"ఎవరి సమస్యలు వాళ్ళే తీర్చుకోవాలి. అయినా ఆపరేషన్ సమ్మర్‌లో పెట్టుకొంటే మంచిది. పిల్లలకి స్కూళ్ళు శెలవు కాబట్టి, నీకు వెళ్ళడానికి సులువుగా ఉంటుంది" అన్నాడు.

మనోహర్‌కి డబ్బు సర్దడం ఇష్టం లేదని వనితకీ, తమ్ముడికీ అర్థమైంది. మగవాడిగా పుట్టిన మనోహర్ అదృష్టవంతుడు. స్వతంత్రంగా చెల్లెలిని తీసుకువచ్చేడు. పూచికపుల్ల ఎత్తకుండా తన చేత పని చేయించాడు. తన తమ్ముడి అవసరానికి నాకేం బాధ్యత లేదని స్పష్టం చేసాడు. అంతేకాక పిల్లలకి శెలవులున్నప్పుడు ఆపరేషన్ పెట్టుకోవడం మంచిదని సలహా చెప్పాడు.

మగ... ఆడ... సమానమేనా... సమానమేనా... వనితని ఈ ప్రశ్న వేధిస్తోంది. ●